

కోహీర్: కవేలి ప్రాథమిక పాఠశాల గేటు వద్ద బురదనీటిలోంచి నడుచుకుంటూ వస్తున్న విద్యార్థులు


నమస్తే తెలంగాణ

మెదక్

I | హైదరాబాద్, గురువారం 13 జూన్ 2024 | MEDAK




సిద్దిపేట జిల్లాకేంద్ర దవాఖానను సందర్శించి మందులను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

# సమస్యల స్వాగతం

- అరకొర వసతులతో ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం
- అందీఅందని పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్
- పాత యూనిఫామ్స్‌తోనే పాఠశాలలకు విద్యార్థులు
- అల్పాహార పథకానికి గుడ్‌బై చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం
- మన ఊరు-మన బడి పనులు మధ్యలోనే నిలిపివేత
- పాఠశాలలు ప్రారంభమైనా ఎక్కడి పనులు అక్కడే...

సిద్దిపేట, జూన్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రభుత్వ పాఠశాలలు పలు సమస్యలతో పునఃప్రారంభమయ్యాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో బుధవారం నుంచి ప్రభుత్వ పాఠశాలలు తెరుచుకున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఉన్న అల్పాహార పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెట్టింది. దీంతో విద్యార్థులు ఆకలితోనే విద్యను అభ్యసించారు. పాఠశాల ప్రారంభం రోజే అన్ని పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్స్ అందిస్తామని చెప్పినా అది ఆచరణలో సాధ్యం కాలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం పాఠశాలలు తెరిచే నాటికి అన్ని సిద్ధం చేసి అందించింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ ఉత్సాహం ఎక్కడా కనిపించ లేదు. మరోవైపు ఉపాధ్యాయులంతా బదిలీలపై దృష్టి సారించారు. సిద్దిపేట జిల్లాలో 638 ప్రాథమిక, 113 ప్రాథమికోన్నత, 227 ఉన్నత పాఠశాలలో మొత్తం విద్యార్థులు 85,291 మంది విధ్యనభ్యసిస్తున్నారు. 4,135 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. మెదక్ జిల్లాలో 623 ప్రాథమిక, 128 ప్రాథమికోన్నత, 146 ఉన్నత పాఠశాలలు ఉండగా మొత్తం 68,449 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. 3,387 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 861, ప్రాథమికోన్నత 191, ఉన్నత పాఠశాలలు 203 కాగా మొత్తం 1,16,707 మంది విద్యార్థులు, 5,025 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఏకరూప దుస్తుల్లో భాగంగా 1 నుంచి 3వ తరగతి వరకు బాలికలకు ఫ్రాక్, 4,5వ తరగతి విద్యార్థినీలకు స్కర్ట్ ఇస్తారు. 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థినీలకు పంజాబీ డ్రెస్, బాలురకు నెక్కరు లేదా ప్యాంట్, షర్టు రెండు జేబులు, మధ్యలో క్లాత్‌తో పట్టి, భుజాలపై క్లాపులు, రెండు చేతులకు క్లిప్పులతో కూడిన డ్రెస్‌లను అందించాలి. కానీ ఉమ్మడి మెదక్ జిల్లా అవసరం మేరకు వస్త్రం రాకపోవడం, కుట్టడం పూర్తి కాకపోవడంతో విద్యార్థులకు ఇంకా 40శాతానికిపైగా కొత్త యూనిఫామ్స్ అందించాల్సి ఉన్నది.



దుబ్బాక బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు

## యూనిఫామ్స్‌కు మరో 20 రోజులు

ప్రతి విద్యార్థికీ రెండు జతల యూనిఫామ్స్‌కు ప్రస్తుతం ఒక జత ఇచ్చారు. ఇంకో జత మరో 20 రోజులు పట్టే అవకాశం ఉన్నది. దీంతో పాఠశాలల ప్రారంభం రోజు విద్యార్థులు పాత యూనిఫామ్స్‌తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. విద్యార్థులకు ఎలాంటి ఖర్చు లేకుండా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పుస్తకాలతోపాటు నోట్ పుస్తకాలను అందించింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా పుస్తకాలను, నోట్ పుస్తకాలను పాఠశాలల ప్రారంభం రోజు అందించాలని సంకల్పించింది. కానీ ఆచరణలో సాధ్యం కాలేదు. తొలి రోజు ఆయా క్లాస్‌కు సంబంధించి కొన్ని టెక్ట్స్ బుక్స్ అరకొరగానే అందించారు. ఇక నోట్ పుస్తకాలు కూడా పూర్తిస్థాయిలో అందలేదు. ప్రభుత్వ బడుల్లో 6 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులకు అందిస్తారు. 6,7 తరగతి వాళ్లకు 6 చొప్పున, 8వ తరగతికి 7 నోట్ పుస్తకాలు, 9,10 తరగతి విద్యార్థులకు 14, ఇంటర్ విద్యార్థులకు 12 నోట్ పుస్తకాలు ఇవ్వాల్సి ఉంది. కానీ పూర్తిస్థాయిలో రాకపోవడంతో ఉన్నవాటిలో కొన్నింటిని మాత్రమే ఇచ్చారు. మిగితావి మరో పక్షం రోజుల్లో అందించే అవకాశం ఉంది. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు కేసీఆర్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన అల్పాహారం పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసింది. కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేసి, పేద విద్యార్థుల ఆకలిని తీర్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఈ పథకాన్ని నిలిపివేయడంతో విద్యార్థులు అల్పాహారం లేక ఆకలితో అలమటిస్తున్నారు. విద్యార్థులను దృష్టి లో పెట్టుకొని వెంటనే అల్పాహారం పథకాన్ని కొనసాగించాలని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



అసంపూర్తి పనులతో మెదక్ జిల్లాలోని పాఠశాల

# మెరుగైన వైద్యం అందించాలి

- సిద్దిపేట జిల్లా ఎమ్మెల్యే హరీశ్‌రావు
- జిల్లాకేంద్రంలోని దవాఖానలో ఎమ్మెల్యే తనిఖీ

సిద్దిపేట, జూన్ 12( నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సిద్దిపేట జిల్లాకేంద్ర దవాఖానను స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌రావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులు, రోగుల కుటుంబసభ్యులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరాతీశారు. దవాఖాన సూపరింటెండెంట్, ఆర్ఎంవో, ఇతర వైద్యులు, సిబ్బందితో కలసి అన్ని విభాగాలను తనిఖీ చేశారు. నాణ్యమైన వైద్యసేవలకు పెట్టింది పేరైన సిద్దిపేట దవాఖానలో ఇకపైనా మెరుగైన సేవలు అందించాలని వైద్యసిబ్బందికి ఆదేశించారు. గర్భిణులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. డైట్ మెనూ అమలును పరిశీలించారు. రోగులు ప్రైవేట్‌కు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోకుండా సర్కారులో మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ఫార్మసీ విభాగాన్ని సందర్శించి మందులు పంపిణీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సరిపడా అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. మందులు, వైద్య పరీక్షల కోసం రోగులను బయటకు పంపించవద్దని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఎమర్జెన్సీ సేవలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. అనంతరం మెడికల్ కాలేజీ ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులు, డాక్టర్లు, అధ్యాపకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



సిద్దిపేట జిల్లాకేంద్ర దవాఖానను సందర్శించి వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న హరీశ్‌రావు

# 'మన ఊరు-మన బడి' కొనసాగించాలి

- సర్కారు విద్యను కాంగ్రెస్ ప్రభుత్వం మరింత బలోపేతం చేయాలి
- పారిశుధ్య సిబ్బందిని నియమించాలి
- బడులకు ఉచిత కరెంట్ ఇవ్వాలి
- తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి..
- ఎస్సెస్సీ ఫలితాల్లో ఐదేండ్లుగా సిద్దిపేట జిల్లాకు అగ్రస్థానం
- సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



సిద్దిపేట బాలుర ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట,జూన్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సర్కారు బడుల బలోపేతానికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన 'మనఊరు-మనబడి' కార్యక్రమాన్ని కాంగ్రెస్ సర్కారు కొనసాగించాలని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కోరారు. బుధవారం సిద్దిపేట జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో విద్యార్థులకు బుక్స్, యూనిఫామ్స్ ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సర్కారు బడులపై చిన్నచూపు చూడకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధిగా తాము, ఉపాధ్యాయులు శ్రద్ధ చూపినప్పుడే విద్యార్థులకు మంచి జరుగుతుందన్నారు. సిద్దిపేటలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దినట్లు తెలిపారు. సిద్దిపేట ప్రభుత్వ బాలుర పాఠశాలలో హాస్టల్‌కు వెంటనే డైనింగ్ రూమ్ మంజూరు చేయించి ప్రారంభించుకుందామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వం సర్కారు స్కూళ్లలో పారిశుధ్య సిబ్బంది నియమించడంతో పాటు ఉచిత కరెంట్ సరఫరా చేయాలని కోరారు. యుద్ధప్రాతిపదికన పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు. తల్లిదండ్రుల ఆలోచనకు అనుగుణంగా బీఆర్ఎస్ ప్రభుత్వం గవర్నమెంట్ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టి మెరుగైన విద్య అందించిందని గుర్తుచేశారు. సిద్దిపేట బాలుర ప్రభుత్వ పాఠశాలలో 98శాతం ఉత్తీర్ణత సాధించినందుకు ఉపాధ్యాయ బృందానికి హరీశ్‌రావు అభినందనలు తెలిపారు. ఈ ఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతానికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు.గతేడాది సిద్దిపేట జిల్లా పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిందని, ఈ ఏడాది మొదటి స్థానంలో నిలవాలన్నారు. సిద్దిపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సొంత డబ్బులు రూ.5 లక్షలతో గతేడాది స్నాక్స్ అందించినట్లు హరీశ్‌రావు గుర్తుచేశారు.

# చేసింది గోరంత..చేసేది కొండంత !

- మెదక్ జిల్లాలో మన ఊరు-మన బడి పనులకు గ్రహణం
- పాఠశాలు ప్రారంభమైనా అసంపూర్తిగా పనులు
- జిల్లాలో 313 పాఠశాలలకు రూ.137.81 కోట్లు మంజూరు
- రూ.36.98 కోట్ల పనులు పూర్తయితే..రూ.27.48 కోట్లు చెల్లింపులు
- సగం బడుల్లో పూర్తి కాని పనులు
- చేసిన పనులకు అందని బిల్లులు..మధ్యలోనే ఆపేస్తున్న కాంట్రాక్టర్లు
- చోద్యం చూస్తున్న కాంగ్రెస్ సర్కారు





మెదక్, జూన్ 12(నమస్తే తెలంగాణ): మనఊరు-మనబడి పథకం మెదక్ జిల్లాలో కార్యరూపం దాల్చడం లేదు. పాఠశాలలను సకలహంగులతో తీర్చిదిద్దాలన్న సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వం మన ఊరు-మనబడి కార్యక్రమాన్ని 2022లో ప్రారంభించింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మన ఊరు-మనబడి పథకం నీరుగారిపోయింది. బుధవారం నుంచి కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమైనా పాఠశాలల్లో మాత్రం పనులు పూర్తి కాలేదు. సకల హంగులతో పాఠశాలలను తీర్చిదిద్దాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించినా పనులు ముందుకు సాగడం లేదు. మనఊరు-మనబడి పథకంలో మంజూరైన నిధులతో పనులు పూర్తి చేయాలంటూ ఆదేశించారు. మొదటి విడుతలో ఎంపిక చేసిన పాఠశాలల పనుల్లో కొన్ని చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు జోక్యం చేసుకొని ఒప్పించి పనులు చేయిస్తున్నారు. పనులు చేసినా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు.

## సగం కూడా పూర్తి కాని పాఠశాలలు

మెదక్ జిల్లాలో 313 పాఠశాలలను మన ఊరు-మనబడికి ఎంపిక చేశారు. ఇందులో 142 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. వీటికి రూ.137.81 కోట్లు మంజూరయ్యాయి. రూ.36.98 కోట్ల పనులు పూర్తి కాగా, ఇప్పటివరకు రూ.27.48 కోట్ల బిల్లులు విడుదలయ్యాయి. ఇంకా రూ.9.50 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సకాలంలో బిల్లులు రావడం లేదని మరమ్మతులు, విద్యుత్, గోడలకు రంగులు వేసే పనులను కాంట్రాక్టర్లు ఆలస్యంగా చేస్తున్నారు. అంతేకాదు నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. దీంతో ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. అంతేకాదు మనఊరు-మనబడి పథకం కింద పాఠశాలలకు భవనాలు పూర్తికాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

### చేసిన పనులకు అందని బిల్లులు

ప్రభుత్వ పాఠశాలల రక్షణకు ప్రహరీల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, వంట గదులు, ఫ్లోరింగ్, విద్యుత్ సౌకర్యం, మూత్రశాలలు, ఫర్నిచర్, మధ్యాహ్న భోజనం చేసేందుకు డైనింగ్ హాల్స్ నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను ఈ పనులకు కేటాయించారు. పనులు చేసినా బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్లు మధ్యలోనే పనులను ఆపేశారు.

### రూ.27.48 కోట్ల బిల్లులు విడుదల



మనఊరు-మనబడి పథకం కింద మెదక్ జిల్లాలోని వివిధ పాఠశాలల్లో చేపట్టిన పనులకు రూ. 27.48 కోట్ల నిధులు విడుదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 313 పాఠశాలలు ఎంపిక కాగా, అందులో 142 పాఠశాలల్లో మన ఊరు-మనబడి పథకం కింద పనులు కొనసాగుతున్నాయి. ఈ పనుల కోసం రూ.137.81 కోట్లు మంజూరయ్యాయి.

- రాధాకిషన్, డీఈవో, మెదక్

# రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



హైదరాబాద్‌లో ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జూన్ 12: దుబ్బాక నియోజకవర్గంలో రోడ్ల విస్తరణతో పాటు, మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఆర్‌అండ్‌బీ ఎస్ఈ వసంతనాయక్‌తో మాట్లాడి రోడ్ల వివరాలు తెలుసుకున్నారు. గతంలో పలు రోడ్లకు నిధులు మంజూరైనప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభంకాలేదని, మరి కొన్నిచోట్ల నిధుల కొరతతో అర్థంతరంగా పనులు నిలిచిపోయాయని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దుబ్బాక పట్టణంలోని రామసముద్రం, పెద్ద చెరువు కట్టల కింద రోడ్లపైకి చెరువు జాలు రాకుండా ప్రత్యేకంగా కాలువలు నిర్మించాలన్నారు. దుబ్బాక-హబ్సీపూర్ వరకు నాలుగులేన్ల రోడ్డుగా విస్తరణ పనులతోపాటు తిమ్మాపూర్-అందె, సూరంపల్లి-నాచారం, మొండిచింత-బేగంపేట సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా విస్తరించాలని సూచించారు. దుబ్బాక మండలం గోసాన్‌పల్లి-శిలాజీనగర్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి, మిరుదొడ్డి మండలం అల్వాల బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. మెట్టు-అల్వాల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గంలో నూతనంగా నిర్మించే రోడ్లకు కావల్సిన నిధు లు మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. సమీక్షలో ఆర్‌అండ్‌బీ ఈఈ బాలప్రసాద్, డీఈ వెంకటేశం, ఏఈలు శ్రీనివాస్, విజయసారథి పాల్గొన్నారు.



పటాన్‌చెరు : విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

# ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య

బడిబాటలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జూన్ 12: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌స్థాయి విద్యను అందజేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని జడ్పీహెచ్ బాలికల పాఠశాలలో బడిబాటలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేశారు. అనంతరం ఎమ్మె ల్యే మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా తిర్చిదిద్దుతున్నామని తెలిపారు. కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందజేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి పీపీ రాథోడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అఫ్జల్, హెడ్మాస్టర్ స్పందనాచౌదరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యూనిఫామ్‌లు పంపిణీ: ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

నారాయణఖేడ్/పెద్దశంకరంపేట, జూన్ 12: నారాయణఖేడ్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు బుధవారం ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ శెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, ఎంఈవో విశ్వనాథ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మన్మద కిశోర్, రమేశ్ చౌహాన్, పండరిరెడ్డి, శంకర్‌ముదిరాజ్ పాల్గొన్నారు. అనంతరం పెద్దశంకరంపేట మండలపరిధిలోని కమలాపురం, జుబ్రాన్‌పల్లి గ్రామాల్లో విద్యార్థులకు యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఫీ కున్నీసా, తహసీల్దార్ గ్రేసీబాయి, నాయకులు రాయిని మధు, సురేందర్‌రెడ్డి, నారాయణగౌడ్, దాచ సంగమేశ్వర్, కుంట్ల రాములు, సంగయ్య, తదితరులున్నారు.



నారాయణ ఖేడ్ : విద్యార్థులకు యూనిఫామ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి



జహీరాబాద్‌లో పుస్తకాలు, దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

## విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి : ఎమ్మెల్యే మాణిక్‌రావు

కోహీర్, జూన్ 12: విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలంటే ఇప్పటి నుంచే కష్టపడి చదువుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోనిర్వహించిన బడిబాటలో భాగంగా విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తట్టు నారాయణ, మార్కెట్ కమి టీ మాజీ చైర్మన్ గుండప్ప, నాయకులు చందు, తంజీమ్, హీరురాథోడ్, విద్యార్థులు పాల్గొన్నారు.